



సూర్యారావుపేట బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు



హౌ..ష్!

పేదల కొంప ముంచిన వైసీపీ

స్పందించని కేంద్రం



లబ్ధిదారుల జాబితాను కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ వెబ్‌సైట్‌లో పట్టణం, గ్రామీణ ప్రాం తం విభాగంలో అప్‌లోడ్ చేయాలి. లబ్ధిదారుడి ఫొటోలతో సహా అప్‌లోడ్ చేస్తే అర్హత సాధించిన ఒక్కో లబ్ధిదారుడి ఇంటి నిర్మాణానికి కేంద్రం రూ.1.50 లక్షలు,రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేయాలి. ఇక్కడే అసలు చిక్కు మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున ఇవ్వడానికి ఏ ఇబ్బందీ లేకపోయినా కేంద్రం నుంచే సమస్య తలెత్తింది. ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలు అధికారులు కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ఇలా చేయాలంటే గ్రామాల వారీగా ప్రత్యేకంగా కేటాయించిన లాగిన్‌లను ఉపయోగించి పథకానికి అర్హత సాధించిన వారి వివరాలు అప్‌లోడ్ చేస్తారు. కానీ ఇప్పటి వరకు కేంద్రం అసలు లాగిన్‌లే ఇవ్వలేదు.దీంతో ఎంపికైన లబ్ధిదారుల వివరాలు జిల్లా అధికారుల వద్దే ఉండిపోయాయి.కాకినాడ జిల్లాలో 326 గ్రామాలకు లాగిన్లు ఇవ్వాల్సి ఉంటే ఇప్పటి వరకు 106 గ్రామాలకే లాగిన్‌లు ఇచ్చారు.వీటి ద్వారా లబ్ధిదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తే కేవలం 1800 దరఖాస్తులు మాత్రమే కేంద్ర వెబ్‌సైట్ స్వీకరించింది. కోనసీమ జిల్లాలో 286 గ్రామాలకు 47 గ్రామాలకే లాగిన్‌లు ఇవ్వగా దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తుంటే స్వీకరించడం లేదు. తూర్పుగోదావరి జిల్లాలో 303 గ్రామాలు ఉంటే 55 గ్రామాలకు కూడా లాగిన్‌లు కేటాయించలేదు. దీంతో లబ్ధి దారులకు ఇప్పట్లో కేంద్రం నుంచి ఇళ్ల నిర్మాణ అనుమతులు వచ్చేలా కనిపించడం లేదు.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో పేదల సొంతింటి కల సాకారం అవడం లేదు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా అనుమతులు రావడం లేదు. ఒక పక్క వీరి అర్హతను ధ్రువీకరిస్తూ గృహ నిర్మాణ శాఖ పచ్చజెండా ఊపినా కేంద్రం అనుమతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసినా వెబ్‌సైట్‌లో నమోదు చేయడానికి కేంద్రం కావాల్సిన లాగిన్‌లు పూర్తిగా ఇవ్వడం లేదు. దీంతో సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోవాలనుకునే పేదలకు ప్రభుత్వ సాయం ఎప్పుడు అందుతుందో స్పష్టత లేదు. అధికారులేమో అర్హులైన లబ్ధిదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తున్నా కేంద్రం ఆమోదం లేక తిరస్కారానికి గురవుతున్నాయి.గత వైసీపీ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో ఎడాపెడా లెక్కలు చూపడంతో అనుమానాలతో తాజా లబ్ధిదారులను కేంద్రం పరిగణనలోకి తీసుకోవడానికి సాంకేతిక ఇబ్బందులు అడ్డువస్తున్నాయని చెబుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో 44,700 మంది పేదలు దీనంగా ఎదురుచూస్తున్నారు. కొందరైతే నిధులు విడుదల ఖాయమని భావించి పనులు చేసేసి బిల్లులు అందక లబోదిబోమంటున్నారు.

44,700 దరఖాస్తులు..

పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సాయం ప్రకటించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సొంత స్థలం ఉన్న పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామన్న హామీని నెరవేర్చ డానికి దరఖాస్తులు స్వీకరించింది. ఈ మేరకు కేంద్రం,రాష్ట్రం కలిపి రూ.2.50 లక్షలు ఇస్తామని ప్రకటించింది.ఈ మేరకు సచివా లయాల ద్వారా గతేడాది నవంబరు ఆఖరు నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 44,700 మం ది దరఖాస్తులు చేసుకున్నారు.అత్యధికంగా కాకినాడ జిల్లాలో 18,500 దరఖాస్తులు, తూర్పు



గోదావరి జిల్లాలో 12,200, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 14 వేల దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు అర్హుల కోసం గ్రామాల వారీగా డిమాండ్ సర్వే నిర్వహించగా 95 శాతం మందికిపైగా అర్హత సాధించారు. వివిధ దశల వడపోత అనంతరం రాష్ట్ర ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖ లబ్ధిదారుల యాప్‌లో వివరాలు నమోదు చేశారు.

- పీఎంఏవైకు ఎదురుచూపులు
- దరఖాస్తులు చేసి 8 నెలలు
- ఇంకనూ రాని అనుమతులు
- 44,700 మంది దరఖాస్తు
- గృహనిర్మాణ శాఖ సర్వే పూర్తి
- 95 శాతం అర్హులుగా గుర్తింపు
- నమోదు కాని వివరాలు
- లాగిన్‌లు కేటాయించని కేంద్రం

గాలి లెక్కలతో అస్తవ్యస్తం

కేంద్రం పీఎం అవాస్ యోజన 2.0 కింద ఉమ్మడి జిల్లాలో సొంత స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. కేంద్రం లాగిన్‌లలో లబ్ధిదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తేనే ఇది సాధ్యం. కేంద్రం లాగిన్‌లు ఇవ్వకపోవడానికి గత వైసీపీ హయాంలో జరిగిన అడ్డదిడ్డ నిర్ణయాలే కారణమని అధికారులు చెబుతున్నారు. అప్పట్లో గొప్పల కోసం కట్టని ఇళ్లను సైతం జగనన్న ఇళ్ల కాలనీల పేరుతో కేంద్రానికి దొంగ లెక్కలు చూపించేశారు. తద్వారా నిధులు రాబట్టేశారు.ఎక్కడో ఊరి చివర, శ్మశానాల వద్ద ఖాళీ స్థలాల్లో పేదలకు భూములిచ్చారు. ఇవన్నీ ముంపు ప్రాంతాలు, ఊళ్లకు దూరంగా ఉండడంతో లబ్ధిదారులు అసలు ఇళ్లు కట్టలేదు. ఇవి పూర్తకపోవడంతో కేంద్రం సీరియస్‌గా ఉంది.ఈ నేపథ్యంలో తాజా లబ్ధిదారులకు చిక్కులు తలెత్తాయి. పాతవి పూర్తికాకపోవడం,నిధులు లాగేయడంతో ఇప్పుడు కేంద్రం కొత్త లబ్ధిదారులను పరిగణనలోకి తీసుకోకుండా లాగిన్‌లు ఇవ్వడం మానేసింది. అప్పటి జగన్ ప్రభుత్వ నిర్వాకం ఇప్పుడు అసలు సిసలు పేదల కొంపముంచింది. డిమాండ్ సర్వే పూర్తవడంతో పథకానికి అర్హత వచ్చేసిందన్న ధీమాతో ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం అనేకమంది పేదలు పునాదులు,శ్లాబ్‌స్థాయి వరకు నిర్మాణాలు చేసేశారు.తీరా బిల్లులు కాదుకదా..కేంద్రం లాగిన్‌లు ఇవ్వకపోవడంతో తలలుపట్టుకుంటున్నారు.

ఆనంద సాగరం.. సూర్యారావుపేట సముద్ర తీరం

సర్పవరం జంక్షన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సాయం సమయాన.. సుందర,సువిశాల సాగర తీరంలో సముద్ర అలల హోరు నుంచి వీస్తున్న చల్లని గాలులు పర్యాటకులకు కనువిందు చేసింది. ఆదివారం సెలవు దినం కావడంతో సాయం సమయాన ఆనందంగా గడిపేందుకు జిల్లా నలుమూలల నుంచి చిన్నారులు, కుటుంబ సభ్యులు, యువకులు కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్ సందర్శనకు వేలాదిగా తరలి వచ్చారు. చిన్నారులు ఇసుకతో ఆటలు ఆడుతూ కుటుంబసభ్యులతో ఉత్సాహంగా గడిపారు. యువకులు బైక్‌లపై విన్యాసాలు, సముద్రంలో జలకాలాటలతో సందడి చేశారు. బీచ్‌లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వాకలపూడి మెరైన్ సీఐ టి.రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, గజ ఈతగాళ్లతో గస్తీ నిర్వహించారు. సముద్రంలో లోతుకెళ్లి స్నానాలు చేయరాదని లౌడ్‌స్పీకర్లతో హెచ్చరిస్తూ అప్రమత్తం చేశారు.



నిమ్మ రైతు..కంటి చెమ్మ!

గోపాలపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధరలేక నిమ్మరైతుల కళ్లు చెమ్మగిల్లుతున్నాయి. పెట్టుబడితోపాటు శ్రమకు తగిన ఫలితం లేకపోవడంతో నిమ్మకాయలు చెట్ల నుంచి కోయడానికి కూడా రైతు అడుగు ముందుకు వేయలేకపోతున్నాడు.ఆశించిన ధర దక్కకపోవడానికి ధరలు తగ్గుదలే ప్రధాన కారణమని నిమ్మరైతులు చెబుతున్నారు. ఏళ్ల కొద్దీ తోటలు పెంచి పూతసమయంలో వర్షాలు కురవడం, పూత రాలిపోవడం వంటి పరిణామాలు నిమ్మ రైతులపై ప్రభావం చూపుతున్నాయి. వేసవిలో ధరలు గరిష్ఠంగా పెరగడంతో దిగుబడి లేక రైతులు ఆశించిన స్థాయిలో నిమ్మకాయలు ఉత్పత్తి చేయలేకపోయారు. ప్రస్తుతం దిగుబడి అధికంగా ఉన్నా ధరలు పడిపోవడంతో నిమ్మరైతుకు అనాసక్తి కలుగుతోంది. ఈ ఏడాది వేసవిలో కిలో నిమ్మ ధర గరిష్ఠంగా రూ.70-రూ.80ల వరకు పెరిగింది. రైతుకు ఆశించిన స్థాయిలో ధర ఉన్నప్పటికీ ఉత్పత్తి, దిగుబడి లేకపోవడంతో డీలా పడ్డారు. ప్రస్తుతం దిగుబడి ఉన్నా ధరలు పతనం కావడంతో కిలో నిమ్మ ధర రూ.25-20 పలుకుతోంది. కిలోకు చిన్న సైజు 25కాయలు.. పెద్దసైజు అయితే 18 కాయలు వరకూ వస్తాయి. దిగుబడి ఉన్నా ఫలితం దక్కడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అమాంతం పడిపోయిన మార్కెట్
- కిలో రూ.20 నుంచి రూ.25
- గిట్టుబాటు కాక ఆందోళన
- లబోదిబోమంటున్న రైతులు

నిమ్మపై పొగాకు ప్రభావం

ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలో పొగాకు, నిమ్మ సాగుపై ప్రభావం చూపుతుంది. దీంతో ఆశించిన స్థాయిలో పెట్టుబడికి దగ్గ ఫలితం లేకపోవడంతో నిమ్మ రైతులు పొగాకు సాగుపై మక్కువ చూపుతున్నారు. గత మూడేళ్లగా పొగాకు ధరలు గరిష్ఠంగా పెరగడంతో నిమ్మను తొలగించి పొగాకు సాగుపై నిమ్మరైతులు సాగుకు మక్కువ చూపుతున్నారు. కాస్తో కూస్తో మిగిలిన నిమ్మ రైతులకు కనీస ధరలు దక్కకపోవడంతో నిరాశచెందుతున్నారు. నిమ్మ ధరలు ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో నిమ్మ సాగు కనుమరుగయ్యే పరిస్థితి ఉంటుంది.



నేతలకు.. సహకారం

పిఠాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సహకార పదవులకు నియామకాలు కొనసాగుతున్నాయి. మూడో విడతలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 141 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం సాయంత్రం రెండు జీవోలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 శాతం సొసైటీలకు నామినేటెడ్ పాలకవర్గాలు ఏర్పాటైనా పిఠాపురం నియోజకవర్గానికి మాత్రం ఇందులో చోటు దక్కలేదు. సహకార సంఘాల త్రిసభ్య కమిటీల నియమాకంలో కూటమి ప్రభుత్వం వేగాన్ని పెంచింది. ఇప్పటికే రెండు విడతల్లో పలు సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించగా మూడో విడతలో ఏకంగా 141 సొసైటీలకు కమిటీలను నియమించింది. వచ్చే ఏడాది జనవరి 30, ఈ ఏడాది అక్టోబరు 30తో గడువు ముగిసే అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల స్థానంలో కూటమి నేతలతో కూడిన త్రిసభ్య కమిటీలను నియమిస్తూ రెండు జీవోలు జారీ అయ్యాయి. ఇందులో కాకినాడ జిల్లాలో 9, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 55, తూర్పు గోదావరి జిల్లాలో 77 సొసైటీలకు కమిటీల నియామకం జరిగింది. ఒకరు చైర్మన్‌గా, మిగిలిన ఇద్దరు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు.నియామకాలతో 423 మంది కూటమి నాయకులకు పదవులు దక్కాయి.

- 141 సొసైటీలకు త్రిసభ్య కమిటీలు
- 2 జీవోలు జారీ చేసిన ప్రభుత్వం
- పిఠాపురానికి దక్కని చోటు

కాకినాడ జిల్లాలో వీరే

కాజులూరు మండలం కోలంక పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బొండా వెంకట నరసింహనాయుడు, తాళ్లరేవు మండలం లచ్చిపాలెం సొసైటీకి మోపూరి వెంకటరెడ్డి నాయుడు, తాళ్లరేవు సొసైటీకి విళ్ల వీర వెంకట ఆదినారాయణ, సామర్లకోట మండలం అచ్చంపేట సొసైటీకి అడబాల వెంకటరమణమూర్తి, పెద్దాపురం జిల్లా కాండ్రకోట సొసైటీకి కుర్రా నారాయణరావు,పెదపూడి మండలం ఏపీ త్రయం సొసైటీకి కోలా సత్యనారాయణ, పెదపూడి సొసైటీకి పి.గంగాధరరావు, పైన సొసైటీకిటి.ఆదినారాయణ, కాండ్రేగుల సొసైటీకి పి.మాధవరావు నియమితులయ్యారు.

పిఠాపురం ఎప్పుడో

మూడో విడతలో కూడా పిఠాపురం నియోజకవర్గానికి అవకాశం దక్కలేదు. నామినేటెడ్ పదవుల భర్తీలో టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య కొంత ప్రతిష్టంభన నెలకొనడంతో జాప్యం చోటుచేసుకుంది. రెండు వారాల కిందటే పదవుల భర్తీపై ఈ పార్టీలు అవగాహనకు వచ్చాయి. ఇందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలోని నాలుగు సొసైటీల చైర్మన్ పదవులు టీడీపీకి, ఎనిమిది సొసైటీల చైర్మన్ పదవులు జనసేనకు కేటాయించారు. సభ్యుల పదవులనూ ఇదే రీతిలో పంచుకునేలా ఆయా పార్టీల నేతల మధ్య ఒప్పందం కుదిరింది. నియోజకవర్గంలోని గొల్లప్రోలు, చేబ్రోలు, చెందుర్తి, అగ్రహారం, రాయవరం, పి.దొంతమూరు, కొత్తపల్లి, ఇసుకపల్లి, యండపల్లి, నాగులాపల్లి, కొమరగిరి, ఇసుకపల్లి సొసైటీలు, పిఠాపురం సీబీఐ ఎఫ్ఎస్‌సీఎస్‌లకు మూడో విడతలో త్రిసభ్య కమిటీల నియామకం జరుగుతుందని ఆశించారు. అయితే ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది.అసలు నియామకాలు జరుగుతాయా లేదా అనే సందేహాలు కూటమి నేతల్లో వ్యక్తమవుతున్నాయి.



మేమున్నామని..

బంగారు కుటుంబాల ముమ్మర సర్వే

మార్గదర్శి–బంగారు కుటుంబం

- చివరిదశలో పీ4 బంగారు కుటుంబ అవసరాల సర్వే
- ట్యాబ్‌లలో నమోదు - కాకినాడ జిల్లాలో 95 శాతం పూర్తి
- మరో రెండు రోజుల్లో అమరావతికి నివేదిక

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీ4 బంగారు కుటుంబాల దత్తత స్వీకరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కుటుంబ అవసరాల సర్వే చివర దశకు వచ్చింది. బంగారు కుటుంబాల అవసరాలు ఏమిటో సచివాయలం ఉద్యోగులు ట్యాబ్‌ల్లో నిక్షిప్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పీ 4 బంగారు కుటుంబాల దత్తత స్వీకరణ లక్ష్యం 2.19 లక్షలు కాగా దాన్ని కాస్తా 2.11 లక్షలకు కుదించారు. దీనిలో ఇప్పటివరకు 1,64,249 బంగారు కుటుంబాలను ప్రభుత్వ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు, ఎన్‌జీవోలు దత్తత స్వీకరించారు. ఇంకా 46,751 కుటుంబాల దత్తత స్వీకరణకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. బంగారు కుటుంబాలకు అవసరాలు ఏమిటో తెలుసుకోవడానికి గత నెల 30వతేదీ నుంచి నీడ్ అసెస్మెంట్ సర్వే ప్రారంభించారు.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గత 11 రోజులుగా సచివాలయ ఉద్యో గులు సర్వే చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 95 శాతం, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 94 శాతం, తూర్పుగోదావరిజిల్లాలో 91 శాతం సర్వే పూర్తి చేశారు. మరో రెండు రోజుల్లో సర్వే పూర్తి కానుంది.

సర్వేలో ఏమి నమోదు చేస్తారు?

కుటుంబ అవసరాల సర్వేలో ఉద్యోగులు ఆయా బంగారు కుటుంబాల ఇంటికి వెళ్లి వారికి ఇచ్చిన ట్యాబ్‌లలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. కుటుంబీకుల విద్యార్హత, ఉపాధి వివరాలు నమోదు అవుతున్నాయి. రోజువారీ కూలీ, చిరు వ్యాపారం, ప్రైవేటు ఉద్యోగం, ప్రభుత్వ ఉద్యోగం, పింఛన్ దారులు వివరాలు ట్యాబ్‌లో నమోదు చేస్తున్నారు. ఒక నెలలో కుటుంబ ఆదాయం నమోదు చేస్తున్నారు. వారి నివాసస్థలం సొంతంగా నిర్మించుకున్నారా లేక అద్దె భవనమా నమోదు చేస్తున్నారు. ఎన్ని మొబైల్ ఫోన్లు ఉన్నాయి, ద్విచక్ర వాహనం, నాలుగు చక్రాల వాహనం, టీవీ, ఫ్రిడ్జ్, వ్యవసాయ భూములు కలిగి ఉన్నారా అనే అంశాలు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల వివరాలు నమోద వుతున్నాయి. ఆయా కుటుంబాల్లో చదువుకున్న వారికి ఏఏ రంగాల్లో ఉద్యోగం కావాలి వంటి వివరాలు నమోదు చేస్తున్నారు. బంగారు కుటుంబంలో ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే వైద్యంపై ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. తొలుత సచివాలయ ఉద్యోగులు బంగారు కుటుంబ సభ్యులను ఏమికావాలో ప్రశ్నిస్తారు. అనంతరం వారిచ్చిన జవాబును అనుసరించి ట్యాబ్‌లలో నమోదు చేస్తున్నారు. సర్వే మరో రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తి కానుంది. ఇప్పటికే 91 నుంచి 95శాతం పూర్తయింది. తర్వాత ఈ నివేదిక అమరావతిలో సచివాలయానికి చేరుకుంటుంది. అక్కడినుంచి వారు ఇచ్చే ఆదేశాల మేరకు పీ4 బంగారు కుటుంబ అవసరాలను తీర్చుతారు.

15వ తేదీకి లక్ష్యం పూర్తి చేయాలి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పీ4 బంగారు కుటుంబాల లక్ష్యం 2.11 లక్షలు కాగా ఇప్పటి వరకు 1,64,249 కుటుంబాలను దత్తత స్వీకరించారు.మిగిలిన 46,751 బంగారు కుటుంబాలను ఈ నెల 15వ తేదీకల్లా మార్గదర్శులు దత్తత తీసుకోవాలి.ఈ మేరకు అధికారులు పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్‌జీవోలు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులను సంప్రదిస్తున్నారు. ఈ నెల 19వ తేదీన సీఎం చంద్రబాబు అమరావతి నుంచి బంగారు కుటుంబాల పథకాన్ని(సాయం అందించే కార్యక్రమాన్ని) ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

బంగారు కుటుంబాల దత్తతకు మార్గదర్శులు ముందుకు రావాలి

పీ4 బంగారు కుటుంబాలను దత్తతు స్వీకరించడానికి మార్గదర్శులు ముందుకు రావాలి. పరిశ్రమల యాజమాన్యం,కార్పొరేట్ సంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులు, హేచరీల యాజమాన్యం, ఎన్‌జీవోలు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు వచ్చి బంగారు కుటుంబాలను దత్తతు స్వీకరించాలి. కుటుంబ అవసరాల సర్వే చివరిదశకు చేరుకుంది. ఈనెల 15వతేదీ కల్లా బంగారు కుటుంబాల దత్తత స్వీకరణ పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా చేరుకునే దిశగా ప్రయత్నం చేస్తున్నాం.

- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

నేడు పీజీఆర్ఎస్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటుచేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమ వుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. పీజీఆర్ఎస్‌కు రాలేని అర్జీదారులు మీకోసం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవా లన్నారు. అర్జీల స్థితిని తెలుసుకోవడానికి 1100 నెంబరుకు కాల్ చేయాలన్నారు.

జిల్లావ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్

కాకినాడ క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత, రక్షణ ముఖ్యంగా నేరాలను అరికట్టేందుకు ఆదివారం పోలీసులు జిల్లా వ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలతో యు.కొత్తపల్లి, ఉప్పాడ బీచ్, గండేపల్లి, రౌతులపూడి, కాకినాడ వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, తిమ్మాపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో సెర్చ్ నిర్వహించారు. కాకినాడ సబ్ డివిజన్ పరిధిలోని పెదపూడి మండలం జి.మామిడాడలోని పొల్లాలో పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. కోరింగ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుంకరపాలెం ఆర్ఆర్ లాడ్జిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.27వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీటర్లు, అనుమానితులు, నేర చరిత్ర గల వారి ఇళ్లను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితుల వేలి ముద్రలను మొబైల్ సిస్టం చెక్ డివైజ్ ద్వారా పరిశీలించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అనంతరం రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, రోడ్డు భద్రత, సీసీ కెమెరాల ఏర్పా టు, శక్తి యాప్ వల్ల ప్రయోజనాలు, టోల్‌ఫ్రీ నెం.112పై ప్రజలకు అవగాహన కల్పించారు.

రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- తాండవ నీటిని విడుదల చేసిన హోంమంత్రి అనిత

కోటనందూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. తాండవ రిజర్వాయర్ నీటిని హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం విడుదల చేశారు. ముందుగా రిజర్వాయర్‌లో వేదపండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం జలహారతి ఇచ్చారు. అనంతరం జరిగిన సమావేశంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో తాండవ రిజర్వాయర్ అభివృద్ధికి నోచుకోకపోవడంవల్ల కనీసం గేట్లు మరమ్మత్తులు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాది పాలనలో రూ.8కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రిజర్వాయర్ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేశామని, నీటిపారుదల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకువెళ్లగా రూ.20కోట్లు ఇచ్చేందుకు అంగీకరించారని తెలిపారు. అనంతరం హోంమంత్రి అనిత మాట్లాడుతూ అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని నర్సీపట్నం, పాయకరావుపేట, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని 60వేల ఎకరాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో నీరందించాలన్నారు. వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులందరికీ న్యాయం చేశామన్నారు. రిజర్వాయర్‌లో 372 అడుగులు నీటి మట్టం ఉండగా ఎగువ ప్రాంతం నుంచి 550 క్యూసెక్కులు నీరు వస్తోందన్నారు. ప్రస్తుతం రైతుల అవసరాలకోసం 75 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ కరక సత్యనారాయణ, వైస్ చైర్మన్ మేరపురెడ్డి జోగిబాబు, జనసేన ఇన్‌చార్జ్ సూర్యచంద్ర, తుని, నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్లు అంకంరెడ్డి రమేష్, గవిరెడ్డి వెంకటరమణ, డీఈ అనురాధ పాల్గొన్నారు.



తాండవ నీటిని విడుదల చేసిన హోంమంత్రి అనిత



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నేరాల అదుపునకు డ్రోన్‌లతో పెట్రోలింగ్



కాకినాడ బీచ్‌లో డ్రోన్ నిఘాలో ఉన్న పర్యాటకులు

కాకినాడక్రైం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ తీరం, బీచ్ పరిసరప్రాంతాల్లో పర్యాటకుల రక్షణకు, చొరబాటుదారులు, అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు జిల్లాపోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రోన్‌లతో నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందని ఎస్పీ జి.బిందుమాధవ్ తెలిపారు. తిమ్మాపురం పోలీసుల ఆధ్వర్యంలో రిజర్వు పోలీస్ బలగాల నుంచి డ్రోన్ ఆపరేటర్ల సహాయంతో ఆదివారం కాకినాడ బీచ్ తీరం మొత్తం గస్తీ నిర్వహించినట్టు ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజల రక్షణ, అసాంఘిక కార్యకలాపాల ఆటకట్టుకు మొదట ప్రాధాన్యమిస్తామని వెల్లడించారు.

ఏలేరులో పెరుగుతున్న నీటి నిల్వలు


ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

ఏలేశ్వరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. మెస్తారు వర్షాలు, గోదావరి జలాలు విడుదల చేస్తుండడంతో రిజర్వాయర్‌లోని నీరు పెరుగుతోంది. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 1225 క్యూసెక్కులు ఏలేరు జలాశయానికి విడుదలవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనిరీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 77.45 మీటర్ల స్థాయిలో 10.66 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 300 క్యూసెక్కులు, ఏలేశ్వరంలోని తిమ్మరాజు చెరువుకు 600 క్యూసెక్కుల వంతులకు నీరు చేరుతోంది. దీంతో రైతులకు సాగు నీరు విడుదలవ్వడంతో రైతులకు పంటలపై భరోసా ఏర్పడింది.

ఉప్పాడ ఉప్పొంగే..

మత్స్యకారుల ఇళ్లల్లోకి సముద్ర కెరటాలు

అవస్థలు పడుతున్న మత్స్యకారులు




ఉప్పాడ మాయాపట్నంలో మత్స్యకారుల ఇళ్లల్లోకి చేరిన నీరు

కొత్తపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి ఉప్పాడ తీరంలో సముద్రం ఆదివారం మళ్లీ ఉప్పొంగింది. దీంతో మాయాపట్నంలో మత్స్యకారుల ఇళ్లల్లోకి కెరటాలు రావడంతో బిందెలు, దాకలు, ఇతర వంటసామగ్రి సముద్రంలో కొట్టుకుపోయాయి. పౌర్ణమి కారణంగా సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. సుమారు 15రోజుల కిందట అమావాస్య కారణంగా సముద్రం ఉప్పొంగడం, సుమారు 10 మత్స్యకార ఇళ్లు కొట్టుకుపోవడం విదితమే. గతంలో మాయాపట్నం గ్రామానికి జియోట్యూబ్ రక్షణ కవచంలా ఉండేది. ప్రస్తుతం ఇక్కడ జియోట్యూబ్ ఆనవాలు లేకుండా కొట్టుకుపోవడంతో రోజు సముద్రంలో ఏర్పడే పోటుపాట్లకు... అలాగే అమావాస్య, పౌర్ణమిరోజుల్లోను, అల్పపీడనాలు ఏర్పడే సందర్భాల్లో కెరటాల ధాటికి నష్టపోయేది మాయాపట్నం గ్రామం కావడంతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్రకోత నుంచి రక్షించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

శ్రీపాద శ్రీవల్లభుడికి ప్రత్యేక పూజలు


శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం

పిఠాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ (రాఖీ) పౌర్ణమికి మహారాష్ట్ర, గోవా, ఢిల్లీ, కర్ణాటకలతో పాటు ఉత్తరాది రాష్ట్రాల భక్తులు శ్రీపాదుని దర్శనానికి రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. శ్రీపాద శ్రీవల్లభుడికి అభిషేకాలు, సర్వపుష్ప పూజ, నామార్చన నిర్వహించారు. దత్త హోమం, గోపూజ జరిగాయి. అనంతరం శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయ స్వామి, నృసింహ సరస్వతులను పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లికి పోటెత్తిన భక్తులు


వెంకన్న ఆలయంలో అష్టోత్తర పూజలు, పాల్గొన్న భక్తులు

ఆత్రేయపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని ఆదివారం అధికసంఖ్య లో భక్తులు దర్శించుకున్నారు. నోము ఆ చరించి అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఆది వారం ఆలయానికి రూ.6,63,297 ఆదా యం లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి నిడదవోలు మండలం కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన బెల్లపు కొండ కృష్ణమూర్తి, గొడవర్తి వరలక్ష్మి కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. సత్తెనపల్లికి చెందిన దేవిశెట్టి నాగేశ్వరరావు- విజయలక్ష్మి దంపతులు రూ.25,116 విరాళం సమర్పించారు. వారికి ఈవో తీర్థప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు.

రూ.6.63 లక్షల ఆదాయం

శరవేగంగా నిర్మాణ పనులు

వెంకన్న ఆలయంలో మాస్టర్ ప్రణాళిక ప్రకారం మెగా ప్రాజెక్టులైన వకుళమాత అన్నప్రసాద భవనం, ఆలయం ఎదురుగా పుష్కరిణి(కొనేరు) నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతున్నారు. ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. శ్రీనివాస ప్రాంగణంలో రూ. 6.10కోట్లతో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ భవనంలో 3వేల మంది



భక్తులు ఒకేసారి అన్నప్రసాదం స్వీకరించేలా రూపకల్పన చేశారు. మరో రూ.1.50కోట్లతో అన్నప్రసాద భవనంలో సామాగ్రి కొనుగోలు చేసేందుకు దాతలు ముందు కు వస్తున్నారు. ఆలయం ఎదురుగా తిరుమల తరహాలో రూ.2.80 కోట్లతో పుష్కరిణి,(కొనేరు) నిర్మాణం వేగవంతం చేస్తున్నారు. పనులు స్వామివారి ఉత్సవాలకు సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

తలుపులమ్మకు మకరతోరణం బహూకరణ


అమ్మవారికి బహూకరించిన మకరతోరణం

తునిరూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో తలుపులమ్మ అమ్మవారికి కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వాసా శ్రీనివాస్ సుమారు రూ.1.25 లక్షలు విలువచేసే 8 కిలోల రాగి, ఇతర లోహాలతో తయారుచేసిన మకరతోరణాన్ని ఆదివారం బహూకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మకరతోరణాన్ని అమ్మవారి మూలవిరాట్‌కు అలంకరించారు. అమ్మవారిని ఆదివారం వేలాది భక్తులు దర్శించుకున్నారు. దీంతో ఆలయానికి రూ.5లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో విశ్వనాధరాజు తెలిపారు.

ప్రమాదవశాత్తు కొబ్బరి దింపు కార్మికుడి మృతి


సత్యనారాయణ మృతదేహం

ఆత్రేయపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి చెట్టు ఎక్కి దింపుతీస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి కార్మికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వసంతవాడకు చెందిన కారంకి వీరవెంకట సత్యనారాయణ(42) దింపు కార్మికుడు. ఆదివారం రామిరెడ్డి వీరభద్ర రైతు పొలంలో కొబ్బరి కాయలు దింపు తీస్తుండగా ప్రమాదవ శాత్తు చెట్టుపై నుంచి జారి పడ్డాడు. వెంటనే స్థానికులు కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

ఇంటి నుంచి అదృశ్యం.. గోదావరిలో మృతదేహం లభ్యం

కొవ్వూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భార్యతో ఘర్షణ పడి ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి మృతదేహం గోదావరిలో లభ్యమైనట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తె లిపారు. బంధువులకు సమాచారం అందించగా కోరశిఖ సత్యనారాయణ(43)గా గుర్తించారు. అతడు ఈనెల 8వ తేదీన రాత్రి భార్యతో ఘర్షణపడి ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. తిరిగి రాకపోవడంతో మృతుడి కుమారుడు కోరశిఖ లక్ష్మీనారాయణ 9న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి ఇసుక ర్యాంపు వద్ద గోదావరిలో మృతదేహం లభ్యం కావడంతో జాలర్ల సహాయంతో బయటకు తీయించి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం సత్యనారాయణ మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయిప్రశాంత్

కిడ్నాప్ కేసులో ఐదుగురి అరెస్ట్

రంపచోడవరం/దేవీపట్నం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం శరభవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సోయం శ్రీ సౌమ్యను ఈ నెల 7న ఉదయం 10, 11 గంటల మధ్యలో ఏడుగురు వ్యక్తులు ఇన్నోవా వాహనంలో వచ్చి కిడ్నాప్ చేసిన ఘటనలో ప్రధాన నిందితుడితో పాటు మరో నలుగురిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ జి.సాయి ప్రశాంత్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ప్రత్యేక

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సురక్షితం

పోలీసు బృందం గుర్తేడు వద్ద ఏ1 నిందితుడైన కోంకోట అనిల్‌కుమార్, ఏ2 కళ్యాణం ఉమామహేష్, ఏ3 రాగోలు దుర్గ విఘ్నేష్‌తో పాటు మరోఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, బాధితురాలని సురక్షింతంగా రక్షించామని పేర్కొన్నారు. ఏ1 అనిల్‌కుమార్‌పై ఎన్డీపీఎస్ కేసులతో సహా క్రిమినల్ చరిత్ర ఉన్నట్టు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు.

సెమీస్ వన్‌సైడ్!



ప్లేయర్ ఆఫ్ ది అవార్డు అందిస్తున్న హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ నాగార్జునరెడ్డి

కాకినాడలో జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు


తలపడుతున్న జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ జట్లు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్‌షిప్-2025లో భాగంగా కాకినాడ క్రీడా మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో ఆదివారం జరిగిన రెండు సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లు వార్ వన్ సైడ్ అన్నట్టు సాగాయి. హర్యానా, ఛత్తీస్‌గడ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా 3-0 స్కోరుతో విజయం సాధించింది. జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్‌లో జార్ఖండ్ 3-0 స్కోరుతో విజయం సాధించింది. హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఎం.నాగార్జునరెడ్డి, కాకినాడ కోరమండల్ సెంటర్ హెడ్ జేఎస్ గంధం ముఖ్యఅతిథులుగా హాజరై మ్యాచ్‌లు వీక్షించారు. కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, రాష్ట్ర హాకీ సంఘ కార్యదర్శి హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి పి.తామస్‌పీటర్, భవాని శంకర్ మ్యాచ్‌లను పర్యవేక్షించారు.


హాకీ ఆడుతున్న హర్యానా, ఛత్తీస్‌గఢ్ జట్లు

ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా వర్మ


వర్మ

అమలాపురం టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడిగా జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఎన్నికలను ఏపీఎన్జీవో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వర్మ తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజు గౌరవాధ్యక్షుడిగా సలాది సాయిసత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా రేపాక వెంకటరాము, ఉపాధ్యక్షుడిగా కె.కిశోర్, సంయుక్త కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కోశాధికారిగా జీవీవీఎన్ త్రినాథ్, ఉపాధ్యక్షుడిగా తనికెళ్ల శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా కె.సునీత, రాష్ట్ర ప్రతినిధిగా డొక్కా రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఎన్నికల అధికారులుగా కె.రంగారావు, పి.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేసే ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం పాటుపడతానని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జుల్ఫికర్ ఆలీ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, పేపకాయల వెంకటకృష్ణ, చార్లెస్ పలువురు అభినందించారు.

'శ్రీప్రకాష్'లో హోరాహోరీగా ఖోఖో పోటీలు


ఖోఖో ఆడుతున్న బాలురు

తునిరూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో అండర్ 14, 17, 19 బాలుర, బాలికల విభాగంలో జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 అంతరాష్ట్ర ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. అండర్ 19 బాలికల విభాగంలో ప్రథమ స్థానం సిస్టర్ నివేదిత స్కూల్ హైదరాబాద్, ద్వితీయ స్థానం వెరిటాస్ సైనిక్ స్కూల్ తిరుపతి, తృతీయ స్థానంలో సివిఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ ఏలూరు, హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ ఖమ్మం నిలిచాయి. విజేతలకు సోమవారం జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో సీబీఎస్ఈ పరిశీలకులు సీహెచ్ఎల్ఎం శ్రీనివాస్, విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.అపర్ణ పాల్గొన్నారు.

13న వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరు 4 నుంచి 13 వరకు చైనాలోని శాంగ్లోలో నిర్వహించనున్న అండర్-15 బాలబాలిక ప్రపంచ స్కూల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి క్రీడాకారుల ఎంపిక ఈనెల 13న కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో చేపట్టనున్నట్టు ఎస్‌జిఎఫ్ సెక్రటరీ లంక జార్జి ఆదివారం తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9గంటలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు 18న విజయవాడ పటమట కేబీసీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి జట్ల ఎంపికలో పాల్గొంటారన్నారు. తర్వాత జాతీయ జట్టు ఎంపిక ఉంటుందన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంపికలు జరుగుతాయని ఆయన తెలిపారు.

ఆటోమేటిక్.. ఐడియా..

ఆటోపై సోలార్ ప్యానెల్ బిగింపు

కాకినాడలో డ్రైవర్ వినూత్న ఆలోచన





ఈ పెద్దాయన బుర్రకు పదును పెట్టాడు. పెరుగుతున్న డీజిల్ ధరలతో బతుకు 'బండి' లాగడం కష్టమని భావించి ఇటీవల ఓ ఈ-ఆటోను కొనుగోలు చేశాడు. 8 గంటలు చార్జింగ్ పెడితే సుమారు వంద కిలోమీటర్ల వరకు ప్రయాణించొచ్చు. అయితే రోజుకు 8 గంటల పాటు బ్యాటరీకి చార్జింగ్ పెడితే కరెంటు బిల్లు తడిసిమోపెడవుతోందని.. ఏం చేయాలని ఆలోచించసాగాడు. తన పొలంలో నీళ్లు తోడే మోటారుకు సోలార్ కనెక్షన్ ఉండడం చూసి.. అంత పెద్ద మోటారే సోలార్‌తో పనిచేస్తున్నప్పుడు.. తన ఈ- ఆటోకు పనిచేయదా? అని ఆలోచించాడు. తన ఆలోచనను కాకినాడలోని అచ్యుతాపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న ఓ సోలార్ టెక్నీషియన్‌కు తెలిపాడు. దీంతో 48 ఓల్ట్స్, 580 వాట్స్ ఉన్న సోలార్ పలకను ఆటోపై భాగాన బిగించాడు. సూర్యకాంతితో ఆటో రయ్.. రయ్ మని కాకినాడ వీధుల్లో తిరగడం ప్రారంభమైంది. ఇంతకీ ఈయన పేరు చెప్పలేదు కదూ.. భాస్కరరావు, ఊరు పెద్దపూడి మండలం అచ్యుతాపురత్రయం. కొన్నేళ్లుగా ఆటో డ్రైవర్‌గా జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. "గతంలో నా ఈ-ఆటోకు గంటల తరబడి చార్జింగ్ పెడితే.. రూ.1500కు పైగా కరెంటు బిల్లు వచ్చేది. ఈ సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేయడంతో చార్జింగ్ పెద్దగా పెట్టాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇప్పుడు మా ఇంటి కరెంటు బిల్లు రూ.800 వరకు వస్తోంది. సోలార్ విద్యుత్ కాస్త డబ్బు ఆదా అవుతోంది." అని పేర్కొన్నాడు.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

జేఎన్టీయూకేలో ముగిసిన ఐడీపీ వర్క్‌షాప్

జేఎన్టీయూకే, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జేఎన్టీయూ సెనేట్ హాల్లో ఐక్యూఏసీ, కెపాసిటీ బిల్డింగ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూషనల్ డవలప్‌మెంట్ ప్లాన్‌పై నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. అవుట్ లైన్‌ఫర్ డవలపింగ్ ఐడీపీ, ఇంప్లిమెంటేషన్ స్ట్రాటజీస్ పై కశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ రవీంద్రనాథ్, ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ ఐడీపీ సెల్ గురించి గౌరీదత్ శాస్త్రి వివరించగా డ్రాఫ్టింగ్ ఐడీపీ ప్యానల్ డిస్కషన్‌లో కె.వెంకటేష్ మోడరేటర్‌గా వ్యవహరించారు. వర్క్‌షాప్‌లో జేఎన్టీయూ వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, డైరెక్టర్ బాలాజీ, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీసీ ప్రసాద్‌తో వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు



పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో శరవేగంగా రెండో దశ పనులు

ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్

మోతుగూడెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పొల్లూరు జల్ విద్యుత్ కేంద్రం రెండో దశలో చేపట్టిన రెండు యూనిట్ల నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయని ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కెవీ.రాజారావు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి అందుబాటులోకి 230 మెగావాట్లు విద్యుత్తు ఉంటుందన్నారు. ఒక్కొక్కటి 115 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ యూనిట్లు మార్చి నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రస్తుతం ఆరో యూనిట్‌కు స్పిరల్ కేస్ మూడో దశ కాంక్రీట్ పనులు జరుగుతున్నాయని మరొక దశ కాంక్రీట్ వేస్తే పనులు పూర్తవుతాయన్నారు. 5వ యూనిట్‌కు టర్బయిన్ ఫ్లోర్ కాంక్రీట్ పనుల కోసం రిఇజన్ ఫోర్స్‌మెంట్ పనులు జరుగుతున్నాయని ఇవి పూర్తయిన వెంటనే జనరేటర్ బ్యారల్ వరకు ఇంకొక దశ కాంక్రీట్ పనులు చేపట్టాలని, అనంతరం ఎలక్ట్రికల్ మెకానిక్ పనులు ప్రారంభిస్తారన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

సోషల్ సర్వీసెస్ హోమ్ ప్రారంభం

పిఠాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొజ్జావారితోటలో మీ నేస్తం సోషల్ సర్వీసెస్ హోమ్‌ను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, టీడీపీ నాయకులు తెలిపారు. ఈ హోమ్‌ను జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సందర్శించి నిర్వాహకులను అభినందించారు.

అప్రకటిత విద్యుత్ కోతలపై ఆగ్రహం

చేబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట జనసేన నాయకుల ధర్నా

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో ఇష్టారాజ్యంగా విధిస్తున్న కోతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గొల్లప్రోలు మండలం చేబ్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జనసేన నాయకులు ఆదివారం రాత్రి



విద్యుత్ శాఖ అధికారితో చర్చలు జరుపుతున్న జనసేన నాయకులు

ధర్నాకు దిగారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో కరెంటు సరఫరాలో తరచూ అంతరాయాలు వస్తున్నాయని, రిపేర్ల పేరుతో గంటల తరబడి సరఫరా నిలిపివేస్తున్నారని వారు మండిపడ్డారు. శనివారం రాత్రి అంతా చేబ్రోలు పరిసర గ్రామాల్లో కరెంటు లేదని, ఆదివారం సాయంత్రం కరెంటు సరఫరా నిలిపివేసి రాత్రి 10గంటల వరకు పునరుద్ధరించలేదన్నారు. ఏపీఈపీడీసీఎల్, సబ్‌స్టేషన్ అధికారులు, సిబ్బందికి ఫోన్లు చేస్తుంటే స్పందించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్వాకంతో ప్రజలకు కంటి మీద కునుకు కరువైందన్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఆందోళనలో రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, జనసేన నాయకులు పెద్దింటి శివ, అల్లం దొరబాబు, సకినాల నూకరాజు, దమ్ము చిన్న, ఉలవకాయల నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు చేదులూరి దొరబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా రాత్రి 10.30గంటల సమయంలో ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు.

అంజు కంటి హాస్పిటల్లో ఆధునిక లేసిక్ మెషీన్ ప్రారంభం

సర్పవరం జంక్షన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ గైగోలు పాడు జంక్షన్‌లో అంజు కంటి హాస్పిటల్ ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ తేజ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక లేసిక్ మెషీన్‌ని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదివారం ప్రారంభించారు. అత్యాధునిక జర్మన్ టెక్నాలజీ, 5 డైమెన్షనల్ యాక్టివ్ ఐ ట్రాకింగ్, ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో లేసిక్ నాణ్యమైన కంటి శస్త్ర చికిత్స నిర్వహించేందుకు ఈ లేసిక్ మెషీన్ దోహదం చేస్తుందని డాక్టర్ తేజ తెలిపారు. కళ్లజోడు, కాంటాక్ట్ లెన్స్ అవసరం లేకుండా కార్నియా ఆకారాన్ని కచ్చితత్వంతో మార్చి కంటిచూపు సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఎండీ కాకర్ల



లేసిక్ మెషీన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు, ఎమ్మెల్యే నానాజీ

పూడి దేవి, ప్రొఫెసర్ డాక్టర్ వి.మురళీకృష్ణ, డాక్టర్ కాదా వెంకటరమణ, డాక్టర్ కె.సత్యనారాయణ డాక్టర్ వై.సుధాకర్, డాక్టర్ సత్య శ్రీనివాస్, డాక్టర్ హిమజ, డాక్టర్ నస్రీన్, డాక్టర్ అంజని, ఏవో హరినాథ్‌బాబు పాల్గొన్నారు.





కాకినాడ జిల్లా గొల్లప్రోలు, కొత్తపల్లి మండలం వాకతిప్పల్లో యూటీఎఫ్ పతాకాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

గొల్లప్రోలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం గొల్లప్రోలులో సంఘ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. సీనియర్ నాయకుడు దాడి పద్మనాభం, జిల్లా కార్యదర్శి అనిశెట్టి సీతారామరాజు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరరావు, ఎంవీ సత్యనారాయణ, కాళ్ల ప్రసాదరావు, గొల్లపల్లి సూర్యనారాయణమూర్తి, వానపల్లి విజయశంకర్, దాసం శ్రీను, బి.నాగబాబు, పలకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): వాకతిప్ప ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ జెండాను కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు గీసాల రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి అవినీతిపై రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు జోకా ప్రసాద్, శ్రీనివాస్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో వ్యక్తిగత క్రమశిక్షణ: ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలు వ్యక్తిగత క్రమశిక్షణ నేర్పుతాయని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక రామారావుపేటలోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో సీబీఎస్ఈ క్లస్టర్-7 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి క్రీడాకారులతో ముచ్చటించారు. పాఠశాల డైరెక్టర్ విజయప్రకాష్ మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ధృడత్వం పెరుగుతుందని, ఓడినా గెలిచినా క్రీడాస్ఫూర్తితో ఉండాలన్నారు. బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ జి.చక్రవర్తి ఆధ్వర్యంలో మొదలైన పోటీల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ సూరిబాబు రాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దాపురంలో బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు సెమీ ఫైనల్స్‌కు చేరాయని డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. అండర్-14, 17, 19 విభాగాల్లో ఏపీ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలను గణేష్ పర్యవేక్షిస్తున్నారు. ప్రధాన రిఫరీగా శ్రీనివాసరావు, ఉప రిఫరీగా భద్రం వ్యవహరిస్తున్నారని ప్రిన్సిపాల్ ఎం.శ్రీదేవి తెలిపారు.



పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో స్టేట్ టాపర్లుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి అనిత

పోలీస్ పరీక్ష విజేతలకు హోం మంత్రి అభినందన

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొంది పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో స్టేట్ టాపర్లుగా నిలిచిన జి.నానాజీ, పి.అప్పలనాయుడు, జి.రమ్యమాధురి, ఎస్.భవాని, ఎం.అచ్యుతరావు విశాఖపట్నంలో హోం మంత్రి వంగలపూడి అనితను కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు శ్యామ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ గుంటూరి శ్యామ్, డైరెక్టర్ శైలజలను మంత్రి అభినందించారు.



సామర్లకోట ఏఎంసీ చైర్‌పర్సన్‌గా మణికుమారి

సామర్లకోట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు జుర్తి చక్రవర్తి భార్య మణికుమారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.





తుప్పలు, మొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్న దేవీనగరం నుంచి ఈబీసీ కాలనీకి వెళ్లే రహదారి (పైన), అధ్వానంగా ఉన్న రోడ్డు (కింద)

అడవి కాదు... రోడ్డే!

ఆ మార్గంలో వెళ్లడానికి జంకుతున్న జనం

గొల్లప్రోలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోలో కనిపిస్తున్న రోడ్డును చూశారా. మొక్కలు, తుప్పలు పెరిగిపోయి అడవిని తలపిస్తోంది. నిత్యం ప్రజలు తిరిగేదే. కానీ అధికారులు, పురపాలకుల నిర్లక్ష్యానికి గురై ఇలా తయారైంది. గొల్లప్రోలు పట్టణంలోని దేవీనగరం నుంచి ఈబీసీ కాలనీకి వెళ్లే రహదారి తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగి ఆ ప్రాంత వాసులకు భయాందోళన కలిగిస్తోంది. 17, 18, 19. 20 వార్డులకు చెందిన ప్రజలు నిత్యం ఇదే మార్గంలో ప్రయాణిస్తారు. చిట్టడవి మధ్యలోంచి నడిచి రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. రాత్రివేళలో ఈ మార్గంలో తిరగడం మానేశారు. కొంత మార్గం అడవిగా, మరికొంత మేర నడవడానికి వీలు లేకుండా ఉంది. వర్షం పడితే మరింత అధ్వానంగా మారుతోంది. ఈ రహదారిని అభివృద్ధి చేయాలని నాలుగు వార్డుల ప్రజలు పదేళ్లుగా నగర పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా ఇప్పటివరకు పట్టించుకోలేదు. దీంతో ప్రమాదమని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో ఈ మార్గాన్ని వినియోగిస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కలెక్టర్ దృష్టి సారించి రహదారిని శుభ్రం చేయించడంతో పాటు సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.





పిఠాపురం, సామర్లకోటల్లో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గీత కార్మికులు, తెలుగుదేశం పార్టీ నాయకులు

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

పిఠాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సంక్షేమానికి చేస్తున్న కృషి, మద్యం పాలసీలో 10శాతం దుకాణాలు కేటాయించినందుకు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, శెట్టిబలిజ, గౌడ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పిఠాపురంలోని జనసేన కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుతో కలిసి బాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాల శెట్టి సునీల్‌కుమార్, ఏఎంసీ చైర్‌పర్సన్ వాకపల్లి దేవిసూర్యప్రకాష్, నాయకులు చెల్లుబోయిన సతీష్, కాకి సింహాద్రి, కంచర్ల భవానీ శంకర్, పెంకే సతీష్, సత్తిబాబు, వాసంశెట్టి వీరబాబు, కండిపిల్లి సత్తిబాబు, పిల్లి శ్రీనివాస్, గుత్తుల మణికంఠ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసింది టీడీపీయేనని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు బడుగు శ్రీకాంత్, పెంకే వెంకటేష్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు కార్యకర్తల సమక్షంలో పాలాభిషేకం చేశారు. బీసీల తరపున కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు శ్రీకాంత్, వెంకటేష్, ప్రకాష్ గౌడ్, గొర్రెల అప్పారావు, గొలితి సత్యనారాయణ, బాడితమాని త్రిమూర్తులు, అడబాల కుమారస్వామి, బలుసు శ్రీనివాసు, విత్తనాల వెంకటరమణ, అరుణవంశీ, పితాని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేయించుకుంటున్న జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసరావు

దుర్గాడలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలో సాయిప్రియ సేవా సమితి వ్యవస్థాపకుడు, జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆ పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు 145 మందిని పరీక్షించి 40 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో రాష్ట్ర వీవర్స్ కార్పొరేషన్ డైరెక్టర్ బేతా సత్యనారాయణ, దుర్గాడ హైస్కూలు విద్యా కమిటీ చైర్మన్ శాఖా నాగేశ్వరరావు, మాజీ చైర్మన్ కందా శ్రీను, గుండ్ర సీతారాం, సఖినాల రాంబాబు, గాది చంద్రరావు, ఇంటి తమ్మాజీ, దేశలంక నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంసీలో వాకింగ్ ట్రాక్ పునః ప్రారంభం

కాకినాడ క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) వాకర్స్ ట్రాక్ ఆదివారం పునః ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు... ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీలతో కలిసి రిబ్బన్‌కట్ చేసి ట్రాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్‌బాబు గ్రౌండ్‌లో ఆకతాయిలకు, సంఘ విద్రోహశక్తులకు తావులేకుండా వాకర్స్‌కు ప్రత్యేక ఐడీ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ నాయకులు పిల్లి సత్యనారాయణమూర్తి, వీవైదాసు, అధిక సంఖ్యలో వాకర్లు పాల్గొన్నారు.



వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ సతీష్

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని ఆర్ఎంసీ మైదానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ శిక్షణ శిబిరాన్ని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ఆదివారం సందర్శించారు. ఆయనకు అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రౌండ్‌లో ఎంపీ సతీష్‌బాబు మొక్క నాటారు. అనంతరం అండర్ 14, 16 క్రీడాకారులతో ఎంపీ మాట్లాడి క్రికెట్‌లో రాణించాలంటూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సత్యనారాయణ, కోశాధికారి ఎన్.వెంకటేష్, సంయుక్త కార్యదర్శి జి.అప్పారావు, కోచ్ ఎన్.రవికిరణ్, కోనసీమ కోచ్ వెంకటనగేష్, పెద్దాపురం కోచ్ ప్రసాద్, సానా సతీష్ ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్, ఆర్ఎంసీ పీఈటీ లక్ష్మణరావు, మాజీ ఉపాధ్యక్షుడు రఫీ తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు కార్డులతో అసోసియేషన్ సభ్యులు

సీసీ టీవీ షాప్ ఓనర్స్, టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేత

కాకినాడ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సీసీ టీవీ షాప్ ఓనర్స్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి సర్వసభ్య సమావేశం ఆదివారం గాంధీ భవన్‌లో జరిగింది. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు. అతిథులుగా కాకినాడ జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరిధర్, కాకినాడ జిల్లా ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడు కాశి, ఐటీ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ మూర్తి హాజరయ్యారు.

అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతుల సురేష్, ఉపాధ్యక్షుడు ఇమ్మంది నాగసాయి దినేష్, ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి కిరణ్ కుమార్, కోశాధికారి పోలిశెట్టి జగదీష్, సభ్యులు బావిశెట్టి కృష్ణ చైతన్యబాబా, గురజాపు శ్రీనివాసరావు, టేకుమూడి త్రిమూర్తులు, అనుసూరి సతీష్, సుంకర రవి ఈశ్వరరావు, కె.సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలి'

కాకినాడ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఒమ్మి రఘురాం పిలుపునిచ్చారు. నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఐక్య వేదిక జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఐక్య వేదిక రాష్ట్ర బాధ్యుడు, కాకినాడ సూపర్‌బజార్ ఛైర్మన్ ప్రెసింగి ఆదినారాయణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరపల్లి గోపాలకృష్ణ అజెండాను వివరించారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ నెలలో జిల్లాలోని పాఠశాలల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని, అన్ని మండలాల్లో అవగాహన సదస్సులు, సమాచార హక్కు చట్టం గ్రామసభల నిర్వహణ చేపట్టాలని, మండల కమిటీలను బలోపేతం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో రాష్ట్ర బాధ్యుడు పప్పు దుర్గారమేష్, జిల్లా బాధ్యులు డేగల రమేష్, చొప్పెర్ల సునీల్, కె.సతీష్, దండుప్రోలు నాగబాబు, అద్దంకి వెంకన్నబాబు, మన్యం సుభద్ర, ఎంవీవీకే రామకృష్ణ, ఎ.రమణ, ఎం.శ్రీహరిబాబు, ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'కొత్త రోటరీ క్లబ్‌ల ఏర్పాటుపై దృష్టి సారించాలి'

కాకినాడ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రోటరీ కొత్త క్లబ్‌ల ఏర్పాటుపై దృష్టిసారించాలని రోటరీ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్, డిస్ట్రిక్ట్ చైర్మన్ తంబాబత్తుల రవి కోరారు. నగరంలోని ఎస్ఎంఎస్ రోటరీ హాలులో ఆదివారం జరిగిన రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభ్యత్వాలను పెంచాలని సూచించారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, డిస్ట్రిక్ట్ ట్రైనర్ ఉష ఆధ్వర్యంలో శిక్షణ పొందిన అధ్యక్ష, కార్యదర్శులు కొత్త క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో క్లబ్ ఉపాధ్యక్షుడు మాజేటి పవన్, కోశాధికారి ఉదయ్, క్లబ్ మెంబర్‌షిప్ చైర్మన్ చోడిశెట్టి పద్దరాజు, సంయుక్త కార్యదర్శి సత్తి రవిరెడ్డి, ఇతర క్లబ్‌లకు చెందిన ఆకెళ్ల ప్రసాద్, జెట్టి పాండురంగారావు, శేఖర్, శ్రీకాంత్, నల్లమిల్లి మాచారెడ్డి, భూపేంద్ర ఫరేక్, వి.ఆనంద్, చిరంజీవిరెడ్డి, నరహరిశెట్టి రవికృష్ణ, ఆకుమర్తి శామ్యూల్, గొడవర్తి సత్యమూర్తి, నేతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'సాహితీ వనం... మన పెద్దాపురం'

పెద్దాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరహాలయ్యపేటలో గల యాసలపు సూర్యారావు భవనంలో చారిత్రక, సాహిత్య, సాంస్కృతిక పెద్దాపురం వైభవంపై పరిచయ కవి సమ్మేళ సభను సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి ఏనుగు లక్ష్మణ కవి నుంచి యువ కవి వంగలపూడి శివకృష్ణ వరకు వందిలాది కవులు, రచయితలు, కళాకారులు పెద్దాపురం నేలను పునీతం చేశారని గుర్తు చేశారు. 'సాహితీ వనం-మన పెద్దాపురం' పేరిట కవితాలాపన చేసి సభికులను అలరించారు. చారిత్రక పరిశోధకుడు వంగలపూడి శివకృష్ణ పౌరాణిక, చారిత్రక, భౌగోళిక, రాజకీయ పరంగా పెద్దాపురం



ప్రాధాన్యం, మహారాజుల పాలన, ఆధ్యాత్మిక క్షేత్రాలు, స్వాతంత్ర్య ఉద్యమంలో పాత్ర, సమర యోధుల పోరాటాలను వివరించారు. సీనియర్ పాత్రికేయుడు చల్లా విశ్వనాథం పెద్దాపురం దేవదాసీ సంస్కృతి, ఆచారాలు, ఆలయ నిర్వహణ, కళాకారుల కృషిపై ప్రసంగించారు. కామవరపు లక్ష్మీకామేశ్వరరావు, నీలపాల సూరిబాబు, పలువురు కవులు పాల్గొన్నారు.



చాగంటి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేద పండితులు

మరిడమ్మ సన్నిధిలో 'చాగంటి'

పెద్దాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు-సుబ్రహ్మణ్యేశ్వరి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు.

మత్స్యకార కుటుంబాలకు సాయం

కాకినాడ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక సముద్ర జలాల్లో పట్టుబడిన నలుగురు మత్స్యకారుల కుటుంబాలకు కాకినాడ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఓనర్స్ అసోసియేషన్ ద్వారా ఆర్థిక సాయం అందించారు. జగన్నాథపురంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఒక్కో కుటుంబానికి రూ.5వేలు నగదు, 25 కిలోల బియ్యం బస్తాను సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సంగాని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నాటి ధర్మారావు, కోశాధికారి చింతా పేర్రాజు, ఉపాధ్యక్షుడు మల్లాడి రాజు, జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షుడు బలసాడి రంగారావు పాల్గొన్నారు.



పారాయణ చేస్తున్న వివిధ రాష్ట్రాల భక్తులు

పిఠాపురంలో సంపూర్ణ భగవద్గీత పారాయణ

పిఠాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారంలో గల శ్రీపాదవల్లభ అనఘా దత్త క్షేత్రంలో ఆదివారం సంపూర్ణ భగవద్గీత పారాయణ వైభవంగా జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పారాయణలో పాలుపంచుకున్నారు. చాతుర్మాస్య వ్రత దీక్షలో ఉన్న మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. అనఘా దత్తాత్రేయస్వామికి తైలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం నగర సంకీర్తన జరిగింది. సాయంత్రం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డైరెక్ట్ ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్లుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులైన యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ పోస్టల్ సూపరింటెండెంట్ దాసరి సూర్య ఉమానాగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు నమూనాను తమ కార్యాలయంలో గానీ, కాకినాడ డివిజన్‌లోని ఏ పోస్టాఫీసు నుంచైనా గానీ పొందవచ్చన్నారు. 18 సంవత్సరాలు పైబడి 10వ తరగతి ఉత్తీర్ణత అంతకంటే ఎక్కువ విద్యార్హత గల వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు బయోడేటా, వయసు, విద్యార్హత, ధ్రువీకరణ పత్రాలు, అనుభవ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తును ఈ నెల 15వ తేదీలోగా కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయానికి పంపాలన్నారు.



శాంతి ర్యాలీ

సామర్లకోట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో తల్లీకూతుళ్ల హత్యోదంతంపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ప్రజలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం సాయంత్రం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి శిక్షపడేలా అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్రౌన్‌పేట కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి కొవ్వొత్తులు వెలిగించి చిన్నారులకు నివాళులర్పించారు.

ముగిసిన మోషే ఉపవాస ప్రార్థనలు

గొల్లప్రోలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు రంగప్ప చెరువు వీధిలోని ఓలీవల దేవాలయంలో 40 రోజులు జరిగిన బైబిల్ మిషన్ మోషే ఉపవాస ప్రార్థనలు ఆదివారం ముగిసాయి. చివరి రోజు తైలాభిషేక పండుగ నిర్వహించారు. ప్రార్థనల అనంతరం మహిళలకు చీరలు అందజేశారు. సంఘకాపరి కట్టు ప్రశాంతకుమార్, రోజాకుమారి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు అందజేస్తున్న సంఘకాపరి ప్రశాంతకుమార్

భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన

కిర్లంపూడి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లంగి గ్రామంలో ఉన్న శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వెనుకభాగంలో ఉన్న ఖాళీ స్థలంలో చిల్లంగి వాస్తవ్యులు సంపర సుధాకర వినాయకవర్మ అన్నదాన సత్రాన్ని సొంత నిధులతో నిర్మిస్తున్నారు. దీనికి ఆదివారం శంకుస్థాపన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రూ.10లక్షల చెక్‌ను ఆలయ కమి టీ సభ్యులకు అందజేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ముంపు గ్రామాల్లో
వరదొచ్చినా చింతక్కర్లేదు

- విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు చర్యలు
- గ్రామ శివారు ప్రాంతాల్లో 9.1 మీటర్ల స్పన్ పోల్స్ ఏర్పాటు
- 62 అడుగుల వరద వచ్చినా విద్యుత్ సరఫరాకు ఢోకాలేదు


స్పన్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఎటపాక, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల సమయంలో ముంపు గ్రామాల్లో ఇక కరెంట్ కష్టాలు తొలగిపోనున్నాయి. పొడవైన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో లోతట్టు ప్రాంతాల్లో ఇకనుంచి శాశ్వతంగా విద్యుత్ సమస్య పరిష్కారం కానుంది. ఆ దిశగా విద్యుత్‌శాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు గోదావరి వరద సీజన్‌లో భద్రాచలం వద్ద 53 అడుగుల మేర గోదావరి వరద వస్తే తోటపల్లి ఫీడర్ పరిధిలో ని సుమారు 20 గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. ఈ గ్రామాల ప్రజలు ప్రతీఏటా వరదల సమయంలో కరెంట్ కష్టాలను ఎదుర్కోవడం తప్పడం లేదు. అయితే ఈనేపథ్యంలో ఎటపాక మండలంలోని తోటపల్లి ఫీడర్ పరిధిలో తోటపల్లి నుంచి మురుమూరు గ్రామం వరకు ఉన్న గ్రామ శివారు ప్రాంతాల్లో 11కేవీ విద్యుత్ లైన్‌లో నూతనంగా (9.1 మీటర్ల)సుమారు 30అడుగుల పొడవైన స్పన్ పోల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈపనులు ఆదివారం నుంచి ప్రారంభించారు. లోతట్టు గ్రామాల శివారులో భద్రాచలం-కూనవరం రోడ్‌లో ప్రధాన రహదారి వెంబడి విద్యుత్ స్పన్ పోల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈపోల్స్ పనులు పూర్తయితే భద్రాచలం వద్ద గోదావరి వరద 62 అడుగుల వరకు వచ్చినా తోటపల్లి ఫీడర్ పరిధి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఢోకా ఉండదు. దీంతో లోతట్టు ప్రాంతాల పరిధిలో ఇక నుంచి గోదావరి వరద సమయంలో విద్యుత్ అంతరాయ సమస్య తీరనుంది. ఇదేకాక వీరాయిగూడెం గ్రామశివారు ప్రాంతంలో విద్యుత్ లైన్ ముంపునకు గురయ్యేచోట స్పన్ విద్యుత్ స్తంభాల ఏర్పాట్ల పనులు పూర్తి చేశారు.

సిరిగిందలపాడులో 300 మందికి వైద్యసేవలు

రంపచోడవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రామకృష్ణమిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందలపాడులో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 300మందికి వైద్యసేవలు అందించినట్టు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. రామకృష్ణమిషన్ క్యాంపు ఇన్‌చార్జీలు స్వామిలోకమయ నందజీ మహారాజ్, స్వామి మృడాత్మనంద మహారాజ్ వైద్యసేవలను పర్యవేక్షించారు. వైద్య శిబిరంలో 66మందికి రక్త పరీక్షలు, 8మందికి ఈసీజీలు, ఆరుగురికి థైరాయిడ్ పరీక్షలు, 15మందికి ఫిజియోథెరపీ చేశారు. పరమహంస నేత్రాలయం ఆధ్వర్యంలో 59మందికి కంటి పరీక్షలు నిర్వహించి 19 మందికి కళ్లజోళ్లు అందజేశారు. కంటి ఆపరేషన్ల కోసం 9మందిని వేమగిరి తరలించారు. వైద్య శిబిరంలో డాక్టరు పోతుల రామారావు గుండెజబ్బులు, రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం రోగులు, సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలి

కూనవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా నాయకుడు వెంకట నారాయణ అన్నారు. యూటీఎఫ్ 52వ ఆవి ర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే విద్య వెనుకపడిపోయిందని రాష్ట్ర విభజన తర్వాత టీచర్ల కొరత ఉందన్నారు. జీవో నెంబరు మూడును తీసుకువచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదే అన్నారని మళ్లీ దానిని పునరుద్ధరించాల్సిన బాధ్యత కూడా ఆయనదే అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కన్నారావు, నాగేశ్వరరావు, కుమారి పాల్గొన్నారు.

నాణ్యతా లోపంతో కుంగిన చప్టా


పూర్తిగా కుంగిన అన్నవరం చప్టా

వీఆర్‌పురం, అగస్టు10 (ఆంధ్రజ్యోతి) వీఆర్‌పురం-చింతూ రు వెళ్లేప్రధాన రహదారిపై ని ర్మించిన చప్టా నిర్మాణంలో నాణ్య తా లోపం కారణంగానే ఆదివారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికే బీటలుబారి కుంగిపోయిందని మండల ప్రజలు ఆరో పిస్తున్నారు. తెలంగాణకు చెందిన కాంట్రాక్టర్ 2023లో దాదాపుగా 40లక్షలతో ఈ చప్టా నిర్మాణం చేపట్టారు. అధికారుల నిర్లక్ష్యంకారణంగా, కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా చప్టా నిర్మాణం చేపట్టడంతో నిర్మాణం జరిగిన రెండు సంవత్సరాలకే కొద్దిపాటి వర్షానికే పూర్తిస్థాయిలో కుంగిపోయిందని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మండల కేంద్రానికి రావడానికి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఉన్నతస్థాయి అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ముగియనున్న మహాలక్ష్మి అమ్మవారి జాతర

వీఆర్‌పురం, అగస్టు 10(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన వీఆర్‌పురంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న మహాలక్ష్మి అమ్మవారి జాతర నేటితో ముగియనున్నది. గత నాలుగు రోజులుగా అమ్మవారి గద్దె దగ్గర ప్రతిరోజు మేళ తాళాలతో, నిష్టనియమాలతో దేవారుల నడుమ గ్రామం సిరి సం పదలతో తులతూగాలని జాతర నిర్వహించారు. ప్రతి రోజు ఇంటింటికి వెళ్లి ధూప దీపాలతో దేవారులు పూజలు నిర్వహిస్తారు.

డొంకరాయిని మండల కేంద్రంగా మార్చండి

మోతుగూడెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలాన్ని విభజించి, డొంకరాయి కేంద్రంగా నూతన మండలం ఏర్పాటుచేయాలని అని ఈప్రాంత ప్రజలు 15 ఏళ్లగా అనేక శాంతియుతమార్గాలలో పోరాటాలు చేశారు. 2017లో 147రోజుల సుదీర్ఘ రిలే నిరాహారదీక్షలు చేస్తే, వారి పోరాటాలకి ఫలితంగా డొంకరాయి కేంద్రంగా మండలం ఏర్పాటు చేస్తాం అని ప్రభుత్వం అప్పటి ఐటీడీఏ పీవో, ప్రస్తుత అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ హామీ ఇచ్చారు. ఇప్పుడు కలెక్టర్ గుర్తేడుని మండల కేంద్రం చేయాలన్న ఆదేశాలు ఎమ్మార్వోకి ఇచ్చి గ్రౌండ్ రిపోర్ట్ తయారు చేయించారు. కలెక్టర్ చర్యలకు నిరసనగా ఆదివారం డొంకరాయిలో మండల సాధన కమిటీ అధ్యక్షుడు కరకా వెంకటరమణ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలు నుంచి ప్రజలు సుమారు 300 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, స్థానిక ఎన్టీఆర్ కూడలి నుంచి శాంతియుతంగా నిరసన ర్యాలీ చేపట్టి గ్రామ ప్రధానకూడళ్ల నుంచి మొదలు పెట్టి అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని వారికి వినతిపత్రం అందజేశారు.

బోర్నగూడెంలో ఉచిత వైద్యశిబిరం


పాఠశాలలో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

రంపచోడవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం రాయల్ ఆసుపత్రి, ప్రజ్ఞ జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బోర్నగూడెం ఆశ్రమ పాఠ శాలలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్టు జనసేన నాయకుడు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ చుప్పల రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్లు శివ, దీపక్‌లు పాఠశాలలో 50మంది విద్యార్థులకు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన 100మందికి వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని వచ్చేవారికి ఉచిత ఆటో సర్వీసు ఏర్పాటు చేశారు. కార్య క్రమంలో ఎస్ఎంసీ సభ్యులు కారం సత్యవేణి, టి.భూపాలరావు తదతరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

వ్యవసాయ రంగాభివృద్ధికి పెద్దపీట

ప్రత్తిపాడులో రైతు విజయోత్సవ సభలో ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయరంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే సత్యప్రభ తెలిపారు. పెద శంకర్లపూడి టీడీపీ కార్యాలయంవద్ద ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ రైతుసదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయం అభివృద్ధి చెంది రైతులు ఆర్థికంగా బాగుంటేనే ఫలితం ఉంటుందనే లక్ష్యంతో ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తుందని రాష్ట్రంలో 46.65లక్షల మంది రైతులకు


పెదశంకర్లపూడి రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఒకేరోజు అన్నదాత సుఖీభవ పథకంలో రూ.7వేలు రైతుల బ్యాంకు ఖాతాలో జమయ్యాయని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో పింఛన్ల పెంపుదల, గ్యాస్ సిలిండర్ల పంపిణీ, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు ఇప్పటికే అమలుకాగా ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలుకాబోతుందని ఎమ్మెల్యే చెప్పారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఏడాది కాలంలోనే వాటిని అమలు పరుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ విజయవంతానికి తోడ్పడిన రైతులకు, నాయకులు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, పర్వత సురేష్, వెన్నా శివ, ఇళ్ళ అప్పారావు, రీసు సత్తిబాబు,అమరాది వెంకట్రావు, రెడ్డి అమర్నాధ్, సర్పంచ్‌లు రొంగల సత్యనారాయణ, సుబ్బారావు, శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజనాపురం కొండపై తాగునీటి సమస్య పరిష్కారం


కొండపై ఏర్పాటు చేసిన తాగునీరు

ప్రత్తిపాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇ.గోకవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఎత్తైన కొండలపై ఉన్న గిరిజనాపుర గ్రామ గిరిజనుల తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఈ గ్రామ గిరిజనులు గతంలో తాగునీటికి పడుతున్న అవస్థలను కలెక్టర్ షన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కొండపై నివసిస్తున్న 11మంది గిరిజన కుటుంబాలకు కొండ దిగువన ప్రవహించే జలధారకు నీటి తొట్టె కట్టి మళ్లింపు చేసి ఆ నీటిని సురక్షిత మంచినీటి పరిశుభ్ర పరిచి గ్రామానికి సరఫరా చేసే పైపులైన్ నిర్మాణ పనులు ఆదివారంనాటికి పూర్తి చేసినట్లు మండల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సుబ్బలక్ష్మి తెలిపారు. కొండపై ఉన్న 11గిరిజన కుటుంబాలకు ప్రత్యేక ట్యాప్‌లు ఏర్పాటుచేసి తాగునీటిసరఫరాకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టడంతో సుదీర్ఘకాలంగా ఉన్న గిరిజనాపురం గ్రామ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమైనట్లు తెలిపారు.

డ్రోన్ కెమెరాతో పోలీస్‌ల పెట్రోలింగ్

రౌతులపూడి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి పోలీస్‌లు డ్రోన్ పెట్రోలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ బింధుమాధవ్ ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి డ్రోన్ పెట్రోలింగ్ చేశారు. అసాంఘిక కార్యక్రమాలు జరిగే అనుమానిత ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో పెట్రోలింగ్ నిఘా ఏర్పాటు చేస్తున్నారు. దానిలో భాగంగా ఆదివారం పోలీస్‌లు రౌతులపూడిలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే అనుమానంతో ఏలేరు కాలువ, శివాలయం వెనుక ప్రాంతంలో డ్రోన్‌తో పెట్రో లింగ్ చేశారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారి భరతం పడతామని హెచ్చరించారు.

దుర్గమ్మ గుడివద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


పేకాట ఆడరాదని హెచ్చరిక బోర్డు పెడుతున్న కానిస్టేబుల్

గండేపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారి గ్రామంలో ఉన్న దుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చేవాళ్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ సందర్భంగా మురారి దుర్గమ్మ ఆలయ పరిసరాల్లోని తోటల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దుర్గమ్మను దర్శించుకునేందుకు కుటుంబ సమేతంగా ప్రజలు విచ్చేస్తారని ఇక్కడ మద్యపానం సేవించి, బహిరంగ ధూమపానం, జూద క్రీడలకు పాల్పడితే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ఎప్పటికప్పుడు నిఘా పెడతామ న్నారు.

మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డిపై చర్యలు తీసుకోవాలి


పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న దళిత నాయకులు

తునిరూరల్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఘటనలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తుని నియోజకవర్గ దళిత నేతలు డిమాండ్ చేశారు. వైసీపీ అరాచకాలు, దాష్టిక చర్యలను దుమ్మెత్తిపోశారు. తిరుపతిలో భూమన కరుణాకరెడ్డి అతని అనుచరులు దళిత యువకుడిని బంధించి చిత్ర హింసలకు గురిచేశారని ఆందోళన వెలిబుచ్చారు. దళిత నేతలు ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకోకుండా జగన్‌రెడ్డి దళితులపై దాడులను ప్రేరేపితం చేస్తున్నారని మండిపడ్డారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దళిత నేతలు లంక సునీల్‌రాజు, తుమ్మలపల్లి నాని, సాకా సుభద్రరావు, బోడపాటి అప్పారావు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్‌ది కీలకపాత్ర

- ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రత్తిపాడు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఆదివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంవద్ద యూటీఎఫ్ జెండాను యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కోడి శ్రీను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్య పరిష్కారంలో యూటీఎఫ్‌ది కీలకపాత్ర అని తెలిపారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి, అభివృద్ధికి యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు అనేక పెండింగ్ సమస్యలు, సీపీఎస్ రద్దు, పీఆర్‌సీ కమిటీ, ఆర్థిక బకాయిలు వంటి వాటిపై పోరాటాలు తప్పవని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ ఆర్.రామలింగేశ్వరరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెం బర్ సీహెచ్‌ఎల్ గణేష్, జనరల్ సెక్రటరీలు దొడ్డిపట్ల రాజబాబు, సీహెచ్ సూర్యవతి, ఎంపీ రమణ, నాయకులు ఎస్.నాగేశ్వరరావు, ఎం.స్వామికుమార్, లక్ష్మీనారాయణ, అన కాపల్లి తాతబ్బాయి పాల్గొన్నారు.



ప్రత్తిపాడు యూటీఎఫ్ పతాకానికి సెల్యూట్ చేస్తున్న నాయకులు

రౌతులపూడి: రౌతులపూడి గ్రామంలో ఎమ్మార్పీ భవనంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కోరుప్రోలు హరిబాబు ఆధ్వర్యంలో యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జెండాను వందనం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నా ఉపాధ్యాయులకు ఏ విధమైనా ఆర్థిక ప్రయోజనం లేదన్నారు. యాప్‌ల పేరుతో బోధనకు ఉపాధ్యాయులను దూరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగరాజు, ప్రధాన కార్యదర్శి అచ్చిరాజు, ఆర్‌వీఆర్ మూర్తి, తాత బాబు తదితరులు పాల్గొన్నారు.

కె.గోపాలపురంలో ఇళ్లు నిర్మించేందుకు చర్యలు

గండేపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.గోపాలపురం గ్రామంలో గత 40 సంవత్సరాల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వాటిని పరిశీలించారు. పీ4 విధానం లో ఇళ్లు నిర్మించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కె.గోపాలపురంలోని ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొత్తం 29మందికి ఇళ్లు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట జట్పీడీసీ పరిమి మంగతాయారు బాబు, టీడీపీ జగ్గంపేట మండలాధ్యక్షుడు జీను మణిబాబు, అవసరాల బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు.


కె.గోపాలపురంలో ఇళ్లు పరిశీలిస్తున్న జ్యోతుల నవీన్

మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం


మోదీ, చంద్రబాబు,పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకంచేసిన గీత కార్మికులు

ప్రత్తిపాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో గీత కార్మికులు ఆదివారం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. మద్యంషాపుల కేటాయింపులో గీత కార్మికులకు 10 శాతం షాపులు మంజూరుచేయడాన్ని పురస్కరించుకుని మండల గీత కార్మికుల సంఘ నాయకులు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలుగా పాలాభిషేకం నిర్వహించారు. మండల గీత కార్మికులు ఎల్గొన్నారు.

మణి బాబుకు సత్కారం

జగ్గంపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్ టీడీపీ కార్యాలయంలో జగ్గంపేట మండల టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ముమ్మన దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో రాజపూడి టీడీపీ నాయకులు నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన జగ్గంపేట మండల టీడీపీ అధ్యక్షుడు జీను మణిబాబును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. దుర్గాప్రసాద్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు నవీన్ సహకారంతో మండలంలో టీడీపీని బలోపేతం చేసి 2029 ఎన్నికల్లో అఖండ మెజార్టీతో మళ్లీ అధికారంలోకి తెస్తామన్నారు. జీను మణిబాబును మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబత్తుల చంద్రశేఖర్, తుమ్మలకిషోర్‌లతో కలసి జీను మణిబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. బత్తుల గణేష్, బంధం అప్పలరాజు,రేఖ నూకరాజు, కోరా డ వెంకటేశ్వరరావు, సందకరమణ, కనకాల రామకృష్ణ, తిరువీధుల పరమటయ్య, బత్తుల గంగాధర్, పెదగాడ శ్రీను, ముమ్మన శివ, జామి వెంకట్రావు పాల్గొన్నారు.


జీను మణి బాబును సత్కరించిన రాజపూడి టీడీపీ నాయకులు

'ఎలక్షన్ కమిషన్ ఏకపక్ష నిర్ణయాలు తగదు'


ప్రత్తిపాడులో లిబరేషన్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బుగతా బంగార్రాజు

ప్రత్తిపాడు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఎలక్షన్ కమిషన్ ఏకపక్ష నిర్ణయాలు తగదని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు అన్నారు. ప్రత్తిపాడు లిబరేషన్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున రావు అధ్యక్షత వహించగా బుగతా బంగార్రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుందని దేశంలోనే పౌరసర్వ చ ట్ట అమలుకు పూనుకుందన్నారు. బీహార్‌లో జరుగుతున్న ఎన్నికల అక్రమాలు భవిష్యత్ దేశంఅంతా జరిగే ప్రమాదం ఉందన్నారు. ఓట్లు దొంగిలించే అధికారులు పదవుల్లో ఉండకూడదని ఆయన డిమాండ్ చేశారు. ఆగస్టు 15న దేశాన్ని రక్షించండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి రాజ్యాంగాన్ని రక్షించండి అనే నినాదాలతో జాతీయజెండాలు గ్రామాల్లో ఎగురవేయాలని ర్యాలీలు నిర్వహించాలని లిబరేషన్ కార్యకర్తలకు బంగ్రారాజు పిలుపునిచ్చారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లవల్ల పేదలకు, చిన్నపాటి వ్యాపారులకు, రైతాంగానికి తీరని నష్టం జరుగుతుందని దీనిని ప్రజలు వ్యతిరేకించాలని లిబరేషన్ ప్రజాసంఘాలు వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.జనార్ధన్, ఆదివాసీ రాష్ట్ర సంఘం అధ్యక్షు డు రేచుకట్ల సింహాచలం, గొడుగు సత్యనారాయణ, శీలం అప్పలరాజు, మానుకొండ లచ్చబాబు, సామిరెడ్డి నారాయణమూర్తి, రాజాల రత్నం, పేరూరి లక్ష్మి, జక్కంపూడి రాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


ప్రత్తిపాడులో బ్రహ్మకుమారీల భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతతోనే మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. ప్రత్తిపాడులో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రాంచ్ రాజయోగ భవనాన్ని ఆదివారం ఆ సంస్థ జిల్లా ఇన్‌చార్జ్ బీకే రజనీ బీబీతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆధ్యాత్మిక మందిరంలో ఏర్పాటుచేసిన శివలింగానికి ఎమ్మె ల్యే పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక విధానంలో ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత ఆత్మ సంతృప్తి పొందవచ్చన్నారు. ప్రత్తిపాడు పరిసర ప్రాంత ప్రజలు బ్రహ్మకుమారి ఈశ్వరి విశ్వవిద్యాలయం రాజయోగ భవ నం సద్వినియోగపరుచుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ బీకే రజనీ బీబీ మాట్లాడుతూ స్వార్థంతో కూడిన ఆలోచనలతో కాకు ండా సమాజం బాగుండాలనే ఆలోచన ధ్యానం ఆచరించాలని కోరారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభతోపాటు సమావేశంలో పాల్గొన్న గ్రామపెద్దలు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ విశ్వేశ్వరరావు, యాళ్ళ జగదీష్, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి వెంకటరత్నం తదితరులకు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే సత్యప్రభకు, శాంతి ఆశ్రమం మాతాజీ నిర్మలానంద సరస్వతికి జిల్లా ఇన్‌చార్జ్ రజనీ బీబీ మెమెంటోలు ఇచ్చి సత్కరించారు. ఈ సమావేశంలో పూనె, మౌంట్ అబూల నుంచి విచ్చేసిన సందీప్ దిల్‌రెడ్డిలు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. బ్రహ్మకుమారిలు మీరా, అక్కయ్య, శ్రీదేవి, వాసవీ, తులసి, మాధవి, సుమ, అంజలి, శివపార్వతి,శ్రీనివాస్, ఫకీర్ రాజు పాల్గొన్నారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


ఈవోకు విరాళం అందజేస్తున్న దాత చినవీరాస్వామి

అన్నవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఒక దాత లక్ష విరాళంగా సమర్పించారు. విజయనగరంనకు చెందిన డి.చినవీరాస్వామి ఈమొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి ప్రత్యేక దర్శనం, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

ముద్రగడ ఆరోగ్యం బాగుండాలని ఆయుష్యహోమం


ఆయుష్యహోమం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శివకుమారి

కాపు ఉద్య మనేత, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం బాగుండాలని ఆదివారం మాజీ ఎమ్మెల్సే అంగూరి లక్ష్మీశివకుమారి ఆయన పేరున ఆయుష్యహోమం నిర్వహించారు. త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాకి నాని తదితరులున్నారు.

సత్యదేవుడికి ఘనంగా రథోత్సవం

రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జిత సేవ అయిన రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి మేళతాళాలతో తూర్పురాజగోపురం వద్దనున్న రథంపై ఆశీనులు గావించి పండితుల ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. ఈవో సుబ్బారావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫార్మేటివ్ పరీక్షలు

తొండంగి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల్లో సోమవారం నుంచి ఫార్మేటివ్ 1 పరీక్షలు జరుగనున్నట్లు ఎంఈవో షేక్ బాబ్జి తెలిపారు. 11న సోమవారం 1 నుంచి 5వ తరగతులకు ఉదయం 9.30నుంచి 10.45 వరకూ తెలుగు, మధ్యాహ్నం 1.15 నుంచి 2.30 వరకూ గణితం పరీక్షలు ఉంటాయన్నారు. 12న ఉదయం ఆంగ్లం , మధ్యాహ్నం పరిసరాల విజ్ఞానం పరీక్షలు జరుగుతాయన్నారు. 6 నుంచి 10 వరకూ సెకండరీ తరగతులకు 6,7,8 తరగతులకు ఉదయం 9.30నుంచి 10.45 వరకూ, 9,10 తరగతులకు 11.00 నుంచి 12.15 వరకూ పరీక్ష ఉంటుందన్నారు. మధ్యాహ్నం పూట 1.15 నుంచి 2.30 వరకూ 6,7,8 తరగతులకూ , 2.45 నుంచి 4.00 వరకూ 9,10 తరగతులకు పరీక్షలు జరుగుతాయన్నారు. 11న ఉదయం తెలుగు, గణితం మధ్యాహ్నం గణితం, 12న ఉదయం హిందీ, మధ్యాహ్నం జనరల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, 13 న ఉదయం ఆంగ్లం, మధ్యాహ్నం సాంఘిక శాస్త్రం పరీక్షలు జరుగుతాయన్నారు. 14న ఉదయం బయాలజికల్ సైన్స్ ఓఎస్ఎస్‌సీ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం అందిస్తున్న అసెస్‌మెంట్ పుస్తకాల ద్వారా పరీక్షలు జరుగనున్నందున ఉపాధ్యాయులు సంబంధిత పరీక్ష కోడ్‌ను ఓఎంఆర్ షీట్‌లో సరిగా నింపాలన్నారు. పరీక్షల ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు కృషిచేయాలని బాబ్జి తెలిపారు.

మంట్లమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

కిర్లంపూడి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణవరం గ్రామదేవత మంట్లమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణానికి ఆదివారం కాకినాడజిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి, జగ్గంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొదిరెడ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై శంకుస్థాపన చేసి పూజలు నిర్వహించారు.

సీసీ రహదారిపై మురుగునీరు

- డ్రైనేజీలు లేక గ్రామస్థుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


రహదారిపై పేరుకుపోయిన మురుగునీరు

రౌతులపూడి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వెలమ కమ్యూనిటీ హాల్‌వీధిలో సీసీ రహదారిపై మురుగునీరు తిష్ట వేసింది. గత కొంతకాలంగా రహదారిపై మురుగు నీరు నిల్వఉంటుంది. ఈ నీటిని దాటుకుని వెళ్లేందుకు కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రహదారి వేసినప్పటికీ డ్రైనేజీ లేకపోవడంతో మురుగు నీరు పోయే మార్గంలేక గృహాల నుంచి వచ్చేనీరు రహదారిపైనే నిల్వ ఉంటుంది. వెలమ కమ్యూనిటీహాల్ నుంచి మార్కెట్ సెంటర్‌కు వెళ్లేందుకు ప్రధానమార్గం. ఈ రహదారిపై మురుగు ఉండడంతో సిమ్మెంట్ ఇటుకలను వేసుకుని దాటుకుంటూ వెళుతున్నారు. ఒక్కొక్కసారి రాళ్లుదాటే సమయంలో కిందపడి గాయాలపాలవుతున్నారు.దు ర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు వృద్ధిచెంది రోగాల భారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని, జిల్లాపంచాయతీ అధికారి పట్టించుకుని మురుగునీరు పోయేమార్గంచేసి ప్రజలను రోగాలభారి నుంచి రక్షించాలని కోరుతున్నారు.